


# పక్కా ప్రణాళికతో ఖరీఫ్ సీజన్ ధాన్యం
# కొనుగోలుకు సన్నద్ధం కావాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- 4 లక్షల 29 వేల పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుపై 236 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ధాన్యం కొనుగోలు సన్నద్ధతపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం నవభూమి బ్యూరో, సెప్టెంబర్ 20:** జిల్లాలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2024-25 ధాన్యం పంట పక్కా ప్రణాళికతో కొనుగోలు చేసేందుకు అధికారులు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోలు సన్నద్ధతపై అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, డి. మధుసూదన్ నాయక్ లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. వానాకాలం ధాన్యం కొనుగోలుకు సంబంధించి రూపొందించుకున్న ప్రణాళిక, అందుబాటులో ఉన్న మౌళిక వసతులు, తదితర అంశాలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏ మాసంలో ఎంత ధాన్యం దిగుబడి కొనుగోలు కేంద్రాలకు వస్తుందో మండలాల వారీగా ముందస్తుగానే ప్రణాళిక తయారు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సమర్థవంతంగా పని చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం యంత్రాలను పరీక్షించాలని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చే షెడ్యూల్ ప్రకారం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌళిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, తూకం యంత్రాలు, టార్పాలిన్ మొదలగు వసతులు ఉండేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం దిగుబడి ఆధారంగా అవసరమైన మేర గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండాలని అన్నారు. ధాన్యం కొనుగోలు దగ్గరే ధాన్యం నాణ్యతను కట్టుదిట్టంగా పరిశీలించాలని, రైస్ మిల్లుల వద్ద ఎటువంటి కోతలు ఉండడానికి వీలు లేదని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 6 లక్షల 77 వేలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా ఉందని, ఇందులో 4 లక్షల 29 వేలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని, వీటి కొనుగోలుకు 236 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అంచనా వేసామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం సన్న రకాల ధాన్యాలను, ధాన్యం కొనుగోలు కేంద్రాల బాధ్యులు, వ్యవసాయ విస్తరణ అధికారితో సమన్వయం చేసుకుంటూ గుర్తించాలని, వీటిని కొనుగోలు చేసిన తర్వాత కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ తెలిపారు. సన్న రకం ధాన్యం కొనుగోలు సమయంలో నాణ్యతను నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సన్న రకాల ధాన్యం గుర్తింపు కోసం వ్యవసాయ విస్తరణ అధికారులను పెద్ద కొనుగోలు కేంద్రాలకు కేటాయించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో త్రాగు నీరు, విద్యుత్ సరఫరా, లైట్లు మొదలగు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేందుకు వీలుగా అవసరమైన మేర వాహనాలు సన్నద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం రవాణాకు కేటాయించిన వాహనాలు దానికి మాత్రమే వినియోగించాలని కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ 1 నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలు, మద్దతు ధర మొదలు అంశాలను వివరిస్తూ కొనుగోలు కేంద్రాల వద్ద బ్యానర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతిరోజు ధాన్యం కొనుగోలుకు సంబంధించిన నివేదిక సమర్పించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జికి అవసరమైన శిక్షణ అందజేయాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, నాణ్యమైన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రావాలని, ఈ అంశం రైతులలో విస్తృతంగా వెళ్ళాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్డీవో ఆర్. సన్యాసయ్య, డి.సి.ఎస్.ఓ. కె. చందన్ కుమార్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, జిల్లా రవాణాధికారి వి. వెంకట్ రమణ, లీగల్ మెట్రాలజీ డి.ఎల్.ఎం.ఓ. ఐ. విజయ్ కుమార్, డి.ఎం.ఓ. ఎం.ఏ. అలీం, డి.సి.ఎం.ఎస్. బిజినెస్ మేనేజర్ కె. సందీప్, డి.సి.ఓ. అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.డి. ఆసిఫ్ అన్వర్, ఎఫ్.సి.ఐ. మేనేజర్ కె. ఎన్. రెడ్డి, అడిషనల్ డి.ఆర్.డి. ఓ. మహమ్మద్ నూరుద్దీన్, డి.పి.ఎం. బి.దర్గయ్య, అధికారులు, పాల్గొన్నారు.

నవభూమి
జిల్లా అనుబంధం
21 సెప్టెంబర్,2024 శనివారం పేజీలు:9
www.epaper.navabhoomi.in


# త్వరలో ప్రాంతీయ కొబ్బరి బోర్డు కేంద్రం..?

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి లేఖలు
- కొబ్బరి బోర్డు తెలంగాణలో లేకపోవటం వల్ల ప్రతి చిన్నపనికి ఏపీలోని బోర్డుపైనే ఆధారపడాలి
- కేరళలోని కొబ్బరిబోర్డుకు లేఖ రాసిన తుమ్మల



**అశ్వారావుపేట-నవభూమిబ్యూరో:** తెలంగాణలో ప్రాంతీయ కొబ్బరి బోర్డు కేంద్రం ఏర్పాటు దిశగా చకచకా అడుగులు పడుతున్నాయి. కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి లేఖలు ఇవ్వడంతో బోర్డు ఏర్పాటు అంశం తాజాగా తెరపైకి వచ్చింది.

కొబ్బరి బోర్డు తెలంగాణలో లేకపోవటం, రాష్ట్రంలోనే భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో అత్యధిక విస్తీర్ణంలో కొబ్బరి తోటలు సాగవటం, ప్రతి చిన్నపనికి ఏపీలోని బోర్డుపైనే ఆధారపడాల్సి వస్తుండటంతో ఇక్కడి రైతులకు ఇబ్బందిగా మారింది. అయిదేళ్లుగా కొబ్బరి బోర్డు ఏర్పాటు అంశంపై వరుస కథనాలు ప్రచురితమవుతున్నాయి. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు బాధ్యతలు చేపట్టడంతో కొంతకాలంగా బోర్డు ఏర్పాటు అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. మంత్రిగా బాధ్యతలు చేపట్టగానే ఉద్యానశాఖ ద్వారా కేరళలోని కొబ్బరి బోర్డు ఉన్నతాధికార కార్యాలయానికి లేఖ రాయించారు.

అనంతరం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలంగాణకు వచ్చినప్పుడు లేఖ ఇచ్చారు. ఢిల్లీలో శివరాజ్‌సింగ్‌ను తాజాగా గురువారం కలిసి ప్రభుత్వం నుంచి కొబ్బరి బోర్డు ఏర్పాటుపై లేఖ అందజేశారు. అధికారులతో కలిసిరావాలని చౌహాన్ చెప్పటంతో ఈ సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని రైతులు భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి జిల్లాలో తొలుత ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం.

# గిరిజన పల్లెల్లో సొబగులు

**భద్రాచలం-నవభూమి:** గిరిజన పల్లెలకు 'ప్రధానమంత్రి ఆది ఆదర్స్ గ్రామ్ యోజన'తో నూతన సొబగులు సమకూరనున్నాయి. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ (మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్- మోటా) చేసిన సర్వే ఆధారంగా దేశ వ్యాప్తంగా మన్యంలోని పల్లెల మౌలిక సదుపాయాల కల్పన కొనసాగుతోంది. ఈ సర్వే ప్రకారం 'పీఎంఏఏజీవై'లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి 64 గ్రామాలను, ఖమ్మం జిల్లాలో 32 గ్రామాలను గుర్తించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 21 మండలాల్లోని 96 గ్రామాల్లో మూడు విడతలుగా అభివృద్ధి పనులు చేయనున్నారు. మొదటి, రెండో విడతల్లో 20 గ్రామాల చొప్పున ఎంచుకోగా మూడో విడతలో మిగతా వాటిలో పనులు చేయాలని నిర్ణయించారు. ఐటీడీఏ పరిధిలో 2022-23లోనే పనులు మొదలవగా ఇప్పటికే చాలా వరకు పూర్తయ్యాయి. 2024-25లో పూర్తి స్థాయిలో ప్రగతి నివేదికలను కార్యాలయానికి చేర్చే వీలుంది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వాపురం మండలంలో 4 గ్రామాలు, దమ్మపేట మండలంలో 10, దుమ్ముగూడెంలో 25, చంద్రుగొండ 2, చర్ల 5, జూలూరుపాడు 1, కొత్తగూడెం 4, టేకులపల్లి 4, ఇల్లెందు 4, లక్ష్మీదేవిపల్లి 3, పాల్వంచ 1, పినపాక మండలంలో ఒక గ్రామం ఎంపికయ్యాయి. ఖమ్మం జిల్లాలో సింగరేణి మండలంలో 8 గ్రామాలు, కామేపల్లి 5, సత్తుపల్లి 2, ఏన్కూరు 2, తిరుమలాయపాలెం 5, కూసుమంచి 5, ఖమ్మం రూరల్ 1, అర్బన్ 2, కల్లూరు మండలంలో ఒక గ్రామం ఎంపికయ్యాయి.

**మన్యంలో అభివృద్ధి**

విద్య, వైద్యం, జీవన ప్రమాణాల పెంపు ఉపాధి కల్పనకు దోహదపడే పనులకు ప్రాధాన్యత కల్పించారు. ప్రతి గ్రామానికి రూ.20.38 లక్షలను కేటాయించారు. ఇప్పటికే ఉన్న అభివృద్ధి పనులను పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి తెచ్చేందుకు ఈ నిధితో చర్యలు చేపట్టారు.



# మిర్చి పంటలో సస్య రక్షణ పద్ధతులు పాటించాలి



**గార్ల, నవభూమి, సెప్టెంబర్ 20:** మిర్చి పంటలో సమగ్ర పోషణ యాజమాన్య, పద్ధతులు సమగ్రమైన సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించ వచ్చు నని గార్ల మండల వ్యవసాయ శాఖాధికారి కె రామారావు రైతులకు సూచించారు. మండలం పరిధిలోని మద్రి గూడెం లో శుక్రవారం మిర్చి క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్చి పంట సోకే చీడపీడల నివారణకు వ్యవసాయ శాఖాధికారుల సలహాలు, సూచనలు రైతులు విధిగా పాటించడంతో పాటు తాము సూచించే క్రిమిసంహారక మందులను పిచికారి చేయాలని కోరారు. రసాయనిక ఎరువులు, మందులను తగిన మోతాదులో వాడాలని, కాంప్లెక్స్ ఎరువులను దుక్కి లో దున్ని వేస్తే మొక్క ధృడంగా పెరిగి అధిక దిగుబడులు వస్తాయన్నారు. రైతులంతా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవరుచుకొని పంటలను సాగు చేయాలని రామారావు సూచించారు.

# వైద్య సిబ్బందిని నియమించాలని ఎమ్మెల్యే కనకయ్య వినతి



**గార్ల, నవభూమి, సెప్టెంబర్ 20:** గార్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బందిని నియమించాలని కోరుతూ ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యుడు కోరం కనకయ్య రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టియానో జెడ్ చొంగ కు విన్నవించారు. ఈమేరకు రాష్ట్ర కార్యదర్శి కి అందించిన వినతిపత్రం ప్రతులను శుక్రవారం గార్లలో విలేకరులకు అందించారు. గార్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో రోగులకు సంబంధించిన అన్ని వసతులున్న వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో హెల్త్ సెంటర్ కు వచ్చే రోగులు నిరాశ నిస్పృహలకు లోను అవుతున్నారని ఆ వినతి పత్రం కనకయ్య తెలిపారు. దీంతో స్పందించిన రాష్ట్ర కార్యదర్శి వైద్యులు, సిబ్బంది నియామకానికి చర్యలు చేపట్టుతామని హామీనిచ్చినట్లు ఆయన తెలిపారు. కాగా మండలం పరిధిలోని సత్య నారాయణ పురంలో నిర్మాణం చేసిన విద్యుత్ సబ్ స్టేషన్ సేవలను పునరుద్ధరణ చేయాలని విద్యుత్, ఇంధన శాఖ రాష్ట్ర కార్యదర్శి డి. రోనాల్డ్ రోజ్ కు మరో వినతి పత్రం అందజేయగా పూర్తి స్థాయిలో పరిశీలన జరిపి సబ్ స్టేషన్ నుంచి ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా జరిపిస్తామని హామీనిచ్చినట్లు కనకయ్య పేర్కొన్నారు. ఈ ఎమ్మెల్యే కనకయ్య వెంట గార్ల సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, తదితరులున్నారు.

# అన్యాయంగా తొలగించారు

- **కన్నీరు మున్నీరైన బాధిత హిందీ పండిత్ ప్రేమ్ లాల్**

**టేకులపల్లి సెప్టెంబర్ 20 నవభూమి ప్రతినిధి:** టేకులపల్లి మండలం ఏకలవ్య మోడల్ స్కూల్లో హిందీ టీచర్ గా పనిచేస్తున్న తనను అన్యాయంగా తొలగించారని బాధిత హిందీ టీచర్, సింగరేణి మండలం భాగ్యనగర్ తండాకు చెందిన వాంకుడోత్ ప్రేమ్ లాల్ ఆవేదన వ్యక్తం చేసాడు. శుక్రవారం టేకులపల్లి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ, హిందీ పండిత్, బీఏ హిందీ, ఎంఏ హిందీ పూర్తి చేసిన తాను 2019 నుంచి 16 సెప్టెంబర్ 2013 వరకు దమ్మపేట లోని గిరిజన బాలుర రెసి డెన్సియల్ కాలేజీలో టీజీటీ హిందీ టీచర్ గా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేశానని తెలిపాడు. 17 సెప్టెంబర్ 2023 లో టేకులపల్లి మండలం ఏకలవ్యలో టీజీటీ హిందీ టీచర్ గా జాయిన్ కావడం జరిగిందన్నారు. ఇక్కడ రెండు పోస్టులు కాగా అప్పటికే కల్పన అనే మేడం టీజీటీ హిందీ టీచర్ గా ఉన్నారని తెలిపాడు. ఇది ఇలా ఉండగా 2024-25 ఈ విద్యా సంవత్సరం జులై నెలలో రెగ్యులర్ టీజీటీ హిందీ టీచర్ ఒకరు రావడంతో ఉన్న ఇద్దరు ఔట్సోర్సింగ్ టీజీటీ హిందీ టీచర్లలో ఒకరిని తీసివేయాల్సిన పరిస్థితిలో తనతో పాటు మరో ఔట్సోర్సింగ్ టీచర్ ఐన కల్పన ఇద్దరికీ డెమోటెస్ట్ పెట్టారని, ఇద్దరి సర్టిఫికెట్స్ పరిశీలించారని, టీచింగ్ నైపుణ్యం, విద్యార్హతలు, డెమోటెస్ట్ లో ప్రతిభ అన్నింటినీ పరిశీలించి నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ (ఎన్ ఇ ఎస్ టి ఎస్)నిబంధనల మేరకే తనను సెలెక్ట్ చేయడం జరిగిందని పేర్కొన్నాడు. జులై నెల నుంచి పనిచేస్తున్న తరుణంలో కల్పన




మేడంను తాను పని చేస్తున్న పోస్ట్ లో టీజీటీ హిందీ టీచర్ గా నియమిస్తూ ఆగస్ట్ 30న భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆమె సెప్టెంబర్ 12న టీజీటీ హిందీ టీచర్ గా జాయిన్ అయ్యారని, సెప్టెంబర్ 11 వరకు తాను పని చేశానని, ఆమె జాయిన్ కావడంతో తనను వద్దన్నారని తెలిపాడు. తాను వర్కింగ్ లో ఉండగా తొలగించడం, వేరే వారిని నియమించడం నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ (ఎన్ ఇ ఎస్ టి ఎస్) నిబంధనలకు విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేసాడు. ఈఎంఆర్ఎస్ గురుకుల కార్యదర్శి, రీజినల్ కో ఆర్డినేటర్ ల దృష్టికి తన సమస్యను తీసుకెళ్లినట్లు చెప్పాడు. తనకు జరిగిన అన్యాయం విషయంలో న్యాయం చేయాలని ఐటీడిఏ పీఓని స్వయంగా కలిసి వేడుకున్నా పుట్టుకతో వికలాంగుడనైన తనను చూసి కూడా కనికరించలేదని ఆవేదన వ్యక్తం చేసాడు. అన్యాయంగా తనను ఉద్యోగం నుంచి తీసివేయడం వల్ల భార్య, ఇద్దరు పిల్లల పోషణ భారంగా మారుతుందని కన్నీటి పర్యంతమయ్యాడు. జిల్లా మంత్రులు, జిల్లా కలెక్టర్, పీఓ, ఈ ఎం ఆర్ ఎస్ అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసాడు.

# వరద బాధితులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

- **తాసీల్దార్ కార్యలయం ముందు ధర్నా**
- **సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ వరద బాధితుల పోరాట సంఘం**

**చర్ల సెప్టెంబర్ 20 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలో ఉన్న తాసిల్దార్ కార్యాలయం ముందు వరద బాధితుల పోరాట సంఘం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా పార్టీల ఆధ్వర్యంలో వరద బాధితులకు ఐదు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వరద బాధిత పోరాట సంఘం గౌరవ అధ్యక్షులు సిపిఐఎంఎల్ (మాస్ లైన్) ప్రజాపంథా పార్టీ డివిజన్ నాయకుడు కొండా చరణ్ మాట్లాడుతూ గత సంవత్సరం నాటి ప్రభుత్వం ఉన్నప్పుడు వరద బాధితులకు ఐదు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని అనేక సందర్భాల్లో అధికారులకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఆ సందర్భంగా అధికారులు గ్రామస్థాయిలో వరద బాధితులను గుర్తిస్తామని సర్వే చేస్తామని చెప్పారు. అంతేకాకుండా ప్రభుత్వ భూమిని గుర్తించి వరదా బాధితులు అందరికీ మేరక ప్రాంతంలో ఐదు సెంట్ల ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వరద బాధితుల పట్ల చిత్తశుద్ధిగా వ్యవహరించలేదు. గత ప్రభుత్వం వరద బాధితుల సమస్య పరిష్కరించడంలో ఘోరాతి ఘోరంగా విఫలమైందని అన్నారు. అందువల్లనే అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అందువలన క్యాలెండర్లో సంవత్సరం తేదీ మారింది అధికారులు మారారు ఇప్పుడు ప్రభుత్వాలు కూడా మారాయి కానీ ఇప్పటివరకు రెవిన్యూ వారు ఇచ్చిన హామీ గ్రామస్థాయిలో సర్వే జరగలేదు ప్రభుత్వ భూమిని గుర్తించలేదు వరద బాధితులకు భూమి కూడా ఇంటి స్థలం కూడా ఇవ్వలేదు. ఈ నిర్లక్ష్యాన్ని వరద బాధితుల పోరాట సంఘం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీగా తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆనాడు వరద బాధితులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి వివిధ పార్టీలు ప్రజాసంఘాలు మేధావులు మద్దతు తెలిపారని అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ కూడా పోరాటంలో భాగస్వామ్యం అయ్యిందని



అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని అధికారంలో ఉంది కాబట్టి వరద బాధితులకు ఐదు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకోవాలని తెలిపారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వంలో వరద బాధితులకు తప్పకుండా న్యాయం జరుగుతుందని మేము ఆశిస్తున్నాము. నమ్ముతున్నాము ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి తక్షణమే గ్రామస్థాయిలో సర్వే నిర్వహించి వరద బాధితులను బాధిత కుటుంబాలను గుర్తించాలని ప్రభుత్వ భూమిని సర్వే చేసి బహిర్గత పరచాలని తద్వారా వరద బాధితులకు మేరక ప్రాంతంలో ఐదు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరద బాధితులకు ఐదు సెంట్ల ఇంటి స్థలం దక్కేంతవరకు వరద బాధిత పోరాట సంఘం సిపిఐ ఎంఎల్ ప్రజాపందా పార్టీ పోరాటం కొనసాగిస్తుందని ఈ విషయంలో వెనకడుగు వేసేది లేదని తెలియజేశారు అనంతరం చల్ల తాసిల్దార్ కార్యాలయం అధికారికి వినతి పత్రం అందజేయడం జరిగింది అధికారి మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని గ్రామస్థాయిలో సర్వే తప్పకుండా నిర్వహిస్తామని తెలిపారు కార్యక్రమాన్ని ముగించడం జరిగింది ఈ కార్యక్రమంలో %జూ×మీా% మాస్ లైన్ ప్రజా పంద పార్టీ నాయకులు కొండ కౌశిక్ చిమిడి సుజాత చెన్న0మోహన్ ఎస్.కె మెహమదా తన్నీరి లక్ష్మీ రేగ ఆంధ్రయ్య వరద బాధిత పోరాట సంఘం నాయకులు గౌర్ల నాగమణి కుమారి సుశీల ఈశ్వరి పున్నారావు దేవి మంగ వేణి సరోజినీ నాగమణి కృష్ణవేణి రాణి విజయ తిరుపతమ్మ ఈశ్వరి శ్రీలత కమల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు

# వరద బాధితులకు సహాయం అందించడం అభినందనీయం

- **ఖమ్మం రూరల్ ఎస్‌హెచ్‌ఓ ఎం రాజు**

**ఖమ్మంరూరల్, నవభూమి, సెప్టెంబర్ 20:** వరద బాధితులకు సహాయం అందించడం అభినందనీయమని రూరల్ ఎస్. హెచ్. ఓ ఎం.రాజు అన్నారు. కల్లూరు పట్టణానికి చెందిన లంకా అప్పల నాయుడు, సత్యావతి దంపతులు తమ కుమారుడు అన్వేష్ పుట్టిన రోజు సందర్భంగా.. ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్ లో వరదబాధితులకు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజు బాధితులకు నిత్యావసర వస్తువులను అందజేసి మాట్లాడారు.. ప్రకృతి విలయం సృష్టించడంతో అనేక మంది నిరాశ్రయులై సర్వం కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మనవతా దృక్పదంతో అప్పల నాయుడి కుటుంబం ఆదుకునేందుకు ముందుకు రావడం అభినందనీయమని, భవిష్యత్ లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని రాజు కోరారు. నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించిన అప్పల నాయుడు మాట్లాడుతూ... ఇబ్బందుల్లో ఉన్నప్పుడు తనవంతు కర్తవ్యంగా సహాయం చేయాలని నిత్యావసర వస్తువులను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు పరిశ పుల్లయ్య, సముద్రాల పుల్లారావు, మిట్టకోలు లక్ష్మీనారాయణ, జర్నలిస్టులు ఏనుగు వెంకటేశ్వరరావు, అశోక్, గంటల ప్రేమ్చంద్ తదితరులు పాల్గొన్నారు.



# బత్తెనపల్లి, బట్టిగూడెం గ్రామాల్లో వైద్య శిబిరం



**చర్ల సెప్టెంబర్ 20 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం సత్య నారాయణ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న బత్తెనపల్లి, బట్టిగూడెం గ్రామాల్లోడాక్టర్ దివ్య నయన ఆధ్వర్యంలో వైద్య శిబిరంను నిర్వహించారు. గ్రామల్లో డ్రై డే ను పరిశీలించారు. 7 జ్వరం బాధితులకు రక్త పరీక్ష చేసి, మలేరియా లేదని నిర్ధారణ చేసి చికిత్స చేయడం జరిగినది. 96 మందికి సాధారణ వ్యాధులకు మందులు ఇవ్వడం జరిగినది. గర్భిణీ స్త్రీలకు పరీక్షలు చెయ్యడం జరిగినది. అలాగే ప్రతి నెల గర్భిణీపరీక్షలు చేయించుట కొరకు హాస్పిటల్ కి రావాలని, సురక్షిత కాన్పు కొరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రము సత్యనారాయణపురం కి రావాలి అని చెప్పడం జరిగినది. జ్వరాలు వచ్చిన వెంటనే అశ్రద్ధ చెయ్యకుండా ఆసుపత్రికి కి రావలెనని చెప్పడం జరిగిందివ్యాధినిరోధక టీకాలు 0.5 సంవత్సర పిల్లలు తప్పకుండా వేయించుకోవాలి, దోమల వలన వచ్చే వ్యాధుల గురించి చెప్పడం జరిగినది. కాచి చల్లార్చిన నీళ్లు త్రాగాలి, నీటి నిల్వలు లేకుండా చూడాలని, ఆశా యాంటి లార్వలు తెమీఫోస్ ద్రావణం చల్లా లనిఅందరూ తప్పనిసరిగా దోమతెరలు కట్టుకోవాలి. జ్వరం వచ్చిన వెంటనే ఆశా, రక్త పూతలు తీసి వారిని ఆసుపత్రి కి పంపించాలని ఆదేశించారు. ఇంటి,ఇంటి కి తిరిగి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఈ.ఓ బాబురావు హెల్త్ అసిస్టెంట్స్ వరప్రసాద్ సుబ్బారావు రాజేశ్వరి సుజాత ఆశా కార్యకర్త జోగమ్మ పాల్గొన్నారు

# రోషమ్మకు నివాళులర్పించిన ఎమ్మెల్యే మట్ట మట్టా రాగమయి దయానంద్



**తల్లాడ, నవభూమి, సెప్టెంబర్ 20:** తల్లాడ మండలంలోని అన్నారు సొసైటీ డైరెక్టర్ గోవింద్ శ్రీనివాసరావు మాతృమూర్తి రోషమ్మ అనారోగ్యంతో మృతి చెందారు ఈ విషయం తెలుసుకున్న సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేడాక్టర్ మట్టా రాగమయి,రాష్ట్ర నాయకులు దయానంద్. హాజరై ఆమె మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పున్నం కృష్ణయ్య మార్కెట్ చైర్మన్ భాగం నీరజ, అన్నారుగూడెం మాజీ సర్పంచ్ మారెళ్ళ మమత, మాజీ ఎంపిటిసి తాళం జోసెఫ్, నాయకులు మారెళ్ళ లక్ష్మణరావు, దుండేటి వీరారెడ్డి, కొమ్మినేని వెంకటేశ్వరరావు, కె.వి, మారెళ్ళ మల్లికార్జున రావు, బొగ్గుల రఘుపతి రెడ్డి, తుమ్మలపల్లి రమేష్, రాయల రాము, దీవెన కృష్ణయ్య, మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కాటారం,సెప్టెంబర్ 20 నవభూమి ప్రతినిధి:** కాటారం 33 కేవీ సబ్ స్టేషన్ పరిధి లోని ధన్వాడ సబ్ స్టేషన్ పవర్ ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతుల కారణంగా శనివారం రోజున ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు కాటారం సబ్ స్టేషన్ పరిధి లోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని,వినియోగదారులు గమనించగలరని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ మెఘనాథ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

# చిన్నారులకు రెండు వేల వేమన పుస్తకాల పంపిణీ

## ■ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో





**సత్తుపల్లి, నవభూమి, సెప్టెంబర్ 20 :** మండలంలోని చిన్నారులకు రెండు వేల వేమన శతక పద్యపుస్తకాలను స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఉచిత పంపిణీ చేశారు. ఆషా స్వచ్ఛంద సేవాసంస్థ, గార్లపాటి పాపాచలం,బొల్లేపల్లి సత్యనారాయణ రాజు స్మారక ట్రస్ట్ లు సంయుక్తంగా ప్రచురించిన వేమన శతక పుస్తకాలను సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆవిష్కరించటం జరిగింది. వాటిని మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు ప్రైవేటు విద్యా సంస్థలకు శుక్రవారం ఉచిత పంపిణీ చేసినట్లు నిర్వాహకులు గార్లపాటి రామకృష్ణ, బి.మధుసూదన రాజు,ఆషా డైరెక్టర్ రామిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. వేమన శతకం లోని వంద పద్యాలను విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పాలని ఉపాధ్యాయులకు వారు సూచించారు. సరళ భాషలోని వేమన పద్యాలు నేర్చుకున్నందు వలన విద్యార్థులకు పఠన, లేఖన సామర్థ్యాలు పెరుగుతాయన్నారు.ధారణ శక్తి మెరుగవుతుందని వివరించారు.నవంబరు నెలలో బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల స్థాయిలో పిల్లలకు పఠన లేఖన పోటీలు నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.వంద పద్యాలు నేర్చుకున్న వారితో నవంబరు నెలాఖరులో మండల స్థాయి వేమన పద్య గళార్చన కార్యక్రమం నిర్వహిచనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# క్రీడల వలన మానసిక ఆరోగ్యంతో పాటు ఉద్యోగాలు లభిస్తాయి

## ■ ఎంపీడీవో సిలార్ సాహెబ్, ఎస్ఐ జగదీష్



**తిరుమలాయపాలెం నవభూమి సెప్టెంబర్ 20** క్రీడా పోటీలు మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం ఉద్యోగాలు కూడా లభిస్తాయని తిరుమలాయపాలెం ఎంపీడీవో సిలార్ సాహెబ్ ఎస్సై కూచిపూడి జగదీష్ మండల విద్యాధికారి ఎం శ్రీనివాసరావు అన్నారు శుక్రవారం మండల కేంద్రమైన తిరుమలాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను వారు ముగ్గురు ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని క్రీడలు ఐక్యమత్యాన్ని పెంపొందిస్తూ మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు వీటితోపాటు ఉద్యోగ అవకాశాలు కూడా ఉన్నాయని చెప్పారు ప్రతి ఒక్క విద్యార్థి విద్యలో పోటీపడినట్లు క్రీడారంగంలో పోటీపడాలని సూచించారు ఈ క్రీడా పోటీల్లో సీనియర్ కబడ్డీ బాలురు ప్రథమ బహుమతి తిరుమలాయపాలెం టీఎస్ డబ్ల్యూ ఆర్ జె సి విద్యార్థులు కైవాసం చేసుకోగా ద్వితీయ బహుమతి ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొందారు సీనియర్ బాలికల విభాగంలో జడ్పీహెచ్ఎస్ కాకరవాయి పాఠశాల విద్యార్థులు ప్రథమ శ్రేణిలో నిలవగా పిండిప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు ద్వితీయ శ్రేణిలో నిలిచారు జూనియర్ బాలికల విభాగంలో కాకరవాయి జిల్లా పరిషత్ పాఠశాల బాలికలు ప్రథమ బహుమతి గెలుపొందగా పిండిప్రోలు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ద్వితీయ శ్రేణిలో నిలిచారు ఈ కార్యక్రమంలో తిరుమలాయపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ కుమారి ఉపాధ్యాయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత పెసర శ్రీనివాసరెడ్డి ఫిజికల్ డైరెక్టర్ మూర్తి ఉపాధ్యాయులు హనుమంతు శోభన ధన మూర్తి కృష్ణ కళా షబానా గంగా ప్రసాద్ రఘు బాబు శ్రీనివాసరావు హమీద్ తదితరులు పాల్గొన్నారు

# సబ్ స్టేషన్ నిర్వహణ విద్యుత్ సరఫరాపై గెస్ట్ తరగతులు

## ■ సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో



**సత్తుపల్లి, నవభూమి, సెప్టెంబర్ 20 :** గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యుత్ సబ్స్టేషన్లు, వినియోగదారులకు పంపిణీ అంశంపై గెస్ట్ లెక్చరర్ తరగతులు శుక్రవారం ఈ ఈ ఈ బి టెక్ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థినీ,విద్యార్థులకు కళాశాల సెక్రటరీ, కరెస్పాండంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. గంగారం 132/33కేవీ సబ్స్టేషన్ నుంచి ట్రాన్స్కో ఏఈ వై.విజయ్ చరణ్ సబ్స్టేషన్ పనిచేసే విధానాన్ని వివరించారు. సబ్స్టేషన్ నిర్మాణానికి అవసరమైన ఎలక్ట్రానిక్ పరికరాలు, డిస్ట్రిబ్యూషన్, మెయింటెనెన్స్ మొదలగు అంశాలను వివరించారు. పవర్ ప్లాంట్స్ లో విద్యుత్తు ఉత్పత్తి అవుతుందన్నారు. సబ్ స్టేషన్ ను ట్రాన్స్మిషన్ లేదా డిస్ట్రిబ్యూషన్ కోసం వోల్టేజ్ ఎక్కువ, తక్కువవులుగా మార్చుకునేందుకు వినియోగిస్తారన్నారు. విద్యుత్ ఉత్పత్తి గ్రిడ్లోని సరఫరా సామర్థ్యాన్ని వివిధ వోల్టేజీల వద్ద సురక్షితంగా ఉండేలా సబ్స్టేషన్లు చేస్తాయన్నారు. ప్రమాద రహితంగా విద్యుత్తును వినియోగదారునికి చేరవేయడానికి వీలు కల్పిస్తాయన్నారు. ఉత్పత్తి వ్యవస్థ ద్వారా విద్యుత్తును సమర్థవంతంగా పంపిణీ చేయడంలో విద్యుత్ సబ్స్టేషన్లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. వోల్టేజ్లను ఒకస్థాయి నుండి మరొక స్థాయికి మార్చడానికి వీలు కలిగి ఉంటాయన్నారు. ఆల్టర్నేటింగ్ కరెంట్ ను డైరెక్ట్ కరెంట్ గా , డైరెక్ట్ కరెంట్ ను ఆల్టర్నేటింగ్ కరెంట్ గా మార్చడానికి కూడా ఉపయోగించబడుతుందన్నారు.విద్యుత్తును వివిధ వోల్టేజీలుగా మార్చడం సబ్స్టేషన్ల ప్రధాన పాత్రలలో ఒకటన్నారు. అవసరాన్ని బట్టి విద్యుత్తు డిస్ట్రిబ్యూషన్ చేయబడుతుందన్నారు. ఇళ్లు,వ్యాపార, భవనాల్లోకి పంపిణీ చేయబడుతుందన్నారు. సబ్స్టేషన్ విద్యుత్ ఉత్పత్తి, విద్యుత్ పంపిణీ మధ్య జంక్షన్ పాయింట్ గా పనిచేస్తుందన్నారు. విద్యుత్ ఉత్పాదక ప్లాంట్లు, విద్యుత్ పంపిణీ వంటి వివిధ వనరుల నుండి విద్యుత్ ను సేకరిస్తుందన్నారు. దానిని విస్తృత ప్రాంతంలోని తుది వినియోగదారులకు పంపిణీ చేస్తుందన్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఒక భాగం అన్నారు. అవసరాన్ని బట్టి సబ్స్టేషన్ లు వోల్టేజీని ఎక్కువ నుండి తక్కువకు మారుస్తాయన్నారు. అనేక ఇతర ముఖ్యమైన విధులను నిర్వహిస్తాయన్నారు. ఉత్పత్తి కేంద్రాల నుంచి విద్యుత్తును సంగ్రహించి వినియోగదారులకు అవసరమైన వివిధ ఓల్టేజీల్లో సరఫరా చేయటంలో సబ్ స్టేషన్ల కు కీలకపాత్ర ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వుటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ ఎలక్ట్రికల్ విద్యార్థులు విద్యుత్తు రంగానికి వెన్నుముక అన్నారు. తరగతి గదిలో చెప్పిన పాఠాలు ప్రాక్టికల్ గా తెలుసుకుంటే మంచిదన్నారు. విద్యార్థులకు సబ్జెక్టులపై మంచి అవగాహన వస్తుందన్నారు. చదువుకోవడంతో పాటు నేర్చుకోవడంపై మరింత ఆసక్తిని కళాశాల కలిగిస్తుంది అన్నారు. సాంకేతిక రంగాల్లో అనుభవజ్ఞుల బోధన అందుబాటులోకి రావడం మంచి పరిణామన్నారు. ట్రిపుల్ ఈ విభాగాధిపతి కె.రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థినీ,విద్యార్థులతో పాటు కళాశాల అధ్యాపకులు మంచి విషయాలను తెలుసుకున్నారన్నారు.

# రైల్వే పోలీస్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

## రైలు బండ్లపై రాళ్లు, రైల్వే ట్రాక్ పరిసరాల్లో చెత్తాచెదారం వేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం

## రైల్వే రక్షక దళం ఎస్సై సురేష్ బాబు



**బోనకల్, నవభూమి, సెప్టెంబర్ 20:** భారత ప్రభుత్వం వారు ఇచ్చిన స్వచ్ఛత హై సేవ కార్యక్రమం లో భాగంగా శుక్రవారం నాడు ఖమ్మం రైల్వే రక్షక దళం ఇనస్పెక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో మన పరిసరాల స్వచ్ఛత పై అవగాహన కార్యక్రమం బోనకల్ గ్రామ పంచాయితీ పరిధిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ వారి ఇంటిని, పరిసరాలను, వారి గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలి అని, తద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చునని తెలిపినారు. అదే విధంగా పనికిమాలిన చెత్తను రైల్వే పరిసరాలలో వేయవద్దని అలా వేసినచో జరిమానా విధిస్తామని తెలిపారు. వెళ్తున్న రైలు బండ్ల పై రాళ్ళు విసరడం, రైలు పట్టాలపై రాళ్ళు మరియు ఇనుప వస్తువులు పెట్టడం చట్టప్రకారం నేరమని, అలాంటి వారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్.పి.యఫ్ ఇనస్పెక్టర్ స్వచ్ఛత పై ప్రతిజ్ఞ చేయించినారు. ఈ కార్యక్రమంలో ఏ. ఎస్. ఐ లు శ్రీ. మొదింసా , ప్రసన్న కుమార్ మరియు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ మహేష్ పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీల పారిశుద్ధ్య పనులపై చిన్న సూపు: సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కమిటీ



**గుండాల సెప్టెంబర్ 20 నవభూమి:** తెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీల పరిస్థితి నిధుల కొరతతో అభివృద్ధికి తీవ్ర జాప్యం ఏర్పడుతుంది. కనీసం గ్రామపంచాయతీ వీధిలో లైట్లు గాని, పారిశుద్ధ్యం బ్లీసింగ్ పౌడర్ దోమల మందులు కొట్టడం కానీ పారిశుద్ధ్య ఇతర నిర్వహణ గాని ఎటువంటి కార్యక్రమాలు సరిగా జరగకపోవడం గ్రామాలలో విష జ్వరాలు ప్రబులుతున్న పరిస్థితులు మండలంలో నెలకొన్నాయి. ఇదే విషయాన్ని మండల అధికారులు జిల్లా అధికారులకు తెలియజేసిన రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు సరిగా రావడం లేదని ఎంపీడీవో స్థాయి అధికారులు చెప్పినా కూడా ఫలితం లేకపోయింది. గ్రామాల్లో పనిచేసే పంచాయతీ కార్యదర్శులను అడగగా మా యొక్క సొంత నిధులతో నడుపుతున్నాము అని వారు చెపుతున్నారు మరి రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసి అభివృద్ధి చేస్తున్నామని చెప్పడం తప్ప క్షేత్రస్థాయిలో ఏమి లేదు అని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ గుండాల మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము,

# దివ్యాంగులు ఆర్థిక బలోపేతానికి కృషి చేస్తాం

## ■ ఎంపీడీవో సిలార్ సాహెబ్

**తిరుమలాయపాలెం నవభూమి సెప్టెంబర్ 20-** తిరుమలాయపాలెం మండల కేంద్రంలో స్థానిక ఐకేపీ కార్యాలయం భవనంలోని మండలానికి చెందిన దివ్యాంగులకు %యా=ణూ% ఎనేబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు స్వయం ఉపాధి శిక్షణ పై అవగాహన సదస్సు మరియు మార్గదర్శక సూచకాలను సమావేశం నిర్వహించారని సంస్థ ప్రతినిధి టి మల్లికార్జున్ తెలిపారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎంపీడీవో గారు పాల్గొని మాట్లాడుతూ మండలంలోని దివ్యాంగులందరూ ఆర్థికంగా బలోపేతం అవ్వాలని అందుకు మా యొక్క సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు నేను ప్రత్యేకంగా దివ్యాంగులకు వారి సమస్యలు పరిష్కారానికి ప్రథమ స్థానాన్ని ఇస్తామన్నారు దివ్యాంగులు ఆర్థికంగా బలోపేతం అవ్వడానికి మా వంతు కృషి మేము చేస్తాము అన్నారు అదేవిధంగా ఈ కార్యక్రమంలో ఏపీఎం అలివేలు మంగ గారు పాల్గొని మాట్లాడుతూ మండలంలోని దివ్యాంగులకు ఐకెపి నుండి కావలసిన సహకారాన్ని అందిస్తూ వారిని అభివృద్ధి పరచడంలో ముందు ఉంటామని తెలిపారు ఎనేబుల్ ఇండియా రాష్ట్ర ప్రతినిధి మల్లికార్జున్ గారు పాల్గొని మాట్లాడుతూ దివ్యాంగులకు ఎనేబుల్ ఇండియా సంస్థ నుండి సొంతంగా వ్యాపారాలు చేసుకొనుటకు నైపుణ్య శిక్షణ ఇచ్చి దివ్యాంగులు వాళ్ల కాళ్ళ మీద వాళ్ళు నిలబడే విధంగా కృషి చేస్తుందని చెప్పారు మండలానికి చెందిన దివ్యాంగులు సుమారు వందమంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు వీరిలోని అర్హత కలిగిన 35 మంది నీ ఎంపిక చేసి %వాదీ× =ాజు×% ద్వారా పది రోజులు వ్యాపార అభివృద్ధి నైపుణ్యత పై శిక్షణ ఇవ్వబడుతుందని అనంతరం సర్టిఫికెట్ జారీ చేస్తామని తెలిపారు ఎస్ ఆర్ డి ఎస్ డైరెక్టర్ గడ్డం రాంబాబు గారు తెలిపారు ఎనేబుల్ కమిటీ ప్రతినిధులు మరియు దివ్యాంగులు పాల్గొన్నారు.










# ఆదివాసి విద్యార్థినేతకు అడవిపూల వందనాలు



ఆదివాసి గూడాలలో ఉదయించిన ఉద్యమ సూర్యుడు, కొప్పుల చిరంజీవి. నికార్సైన నీతి నిజాయితీలకు యువ నాయకుడిగా పేరు గడించిన వాడు. ఆదివాసి ముద్దుబిడ్డ చిరంజీవి. రాజ్యాంగ పరంగా సంక్రమించిన హక్కులు దక్కనప్పుడు, పాలకులు పరిపాలన మీద దృష్టి పెట్టనప్పుడు, ప్రజలకు ఉన్న చివరి ఆయుధం ఉద్యమమేనని గుర్తించిన విద్యార్థి మేధావి. పేరు ప్రఖ్యాతలు పొందిన మహానేతగా యావత్ ఆదివాసి సమాజం గుర్తిస్తుంది. అంబేద్కర్ చూపిన బాటలో బోధించు, సమీకరించు, పోరాడు. అంబేద్కర్ తత్వాన్ని అలవర్చుకొని, రాజ్యాంగం అమలు కానటువంటి సమయంలో కొమరం భీమ్ స్ఫూర్తితో ఉద్యమ జెండాని ఎగరవేసిన మహానేతగా హక్కుల నిప్పులను కొలిమిని రాజేస్తూ నూనూగు మీసాల మెదడులలో స్ఫూర్తిని రగిలింపజేసిన వీరుడు, విద్యార్థి మహా సైన్యానికి కొనసాగుతూ ఉద్యమ యుద్ధంలో మడమ తప్పని వీరునిగా అందరికీ సుపరిచితమే. చదువే ఆదివాసి సమస్యలకు వజ్రాయుధమని గ్రహించి చదువుల విలువను తెలియజేస్తూ, ఆదివాసి గుడాలలో చదువుల వెలుగులు విర చిమ్మేలా ఆదివాసి విద్యార్థులను ఏకం చేస్తూ, కాలేజీలు హాస్టల్ స్థాపనలో ఎనలేని కృషి చేసిన ఉద్యమ వీరుడు కొప్పుల చిరంజీవి. ఏ ఎస్ యు ను బలోపేతం చేయడంలో విశేషమైన కృషిని ఇప్పుడున్నటువంటి విద్యార్థి లోకం గత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటే వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లు భావిస్తుంది. స్వయం ప్రతిపత్తి జిల్లాలు ఏర్పడాలని ఆదివాసుల హక్కులు దక్కాలని మహా స్వప్నాన్ని కలగన్న నేతవు. దానిలో భాగంగానే పాదయాత్రలో, రాస్తారోకోలు, బందులు మొదలైన కార్యక్రమాలలో నిర్విఘ్నంగా పోరుబాట నడిపిన విద్యార్థినేతగా ఆదివాసి సమాజం నిన్ను కీర్తిస్తుంది. ఏజెన్సీ ఏరియా వాటాలు జీవో నెంబర్ 3 అమలు చేయడంలో ప్రభుత్వాలతో, అధికారులతో ఏకకాలం నిరంతర పోరాటం కొనసాగిస్తూ ఎక్కడ అమలు కాని విధంగా సంపూర్ణ ఉద్యోగాలను నిరుద్యోగులకు అందించి దొంగలపాలు కాకుండా కన్నబిడ్డలకు ఇచ్చిన చందంగా జాతి కాగడ మంటావలె దారి చూపిన దీరోత్తమా నిన్ను మరువ మా తరమా మీ సేవలు ఇకలేవని మదినిండా నీ విజయ గాధలే మాకు కొవ్వొత్తుల కరుగుతూ ఆదివాసి సమాజం నుండి విసిరిన ఈటెల లక్ష్యాలను అందుకుంటూ ముందుకు సాగిన మహత్తర ఘనత మరోమారు గుర్తు చేసుకుంటుంది. హక్కుల ఉద్యమ సూర్యుని, బాధ తత్పరిత హృదయాలతో నీ అడుగుజాడలను భావితరాలు శిరోధార్యంగా భావించి ఉద్యమ బాటలోనే ప్రయాణించడానికి నీ ప్రేరణను పునికి పుచ్చుకుంటుంది యావత్ ఆదివాసి లోకం. మా మధ్యలో బాహ్యంగా లేకపోయినప్పటికీ నింగికెగిసిన ఉద్యమ శిఖరంగా ఆదివాసి హక్కుల సుదూర లక్ష్యాలను రక్షించాలని కలలుగన్న చిరంజీవిగా మా మదిలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన ఆదివాసి వీరునిగా శిరస్థాయిగా నిలిచిపోయే మహావీరుడవే. ఉద్యమాల ఊపిరివే ఆదివాసి విద్యార్థుల ఉద్యమ నాయకుడిగా వెలుగొందుతావు, మా సహచర ఉద్యమకారుడా ఇవే మా కన్నీటి వీడుకోలు. నీ ఆశయ సాధన కోసం ఉమ్మడిగా విద్యార్థులందరూ కలిసి నువ్వు చూపిన ఉద్యమ పోరుబాటలో ప్రయాణించడానికి ప్రయత్న లోపం లేకుండా కొనసాగుతుంది మా ప్రయాణం.

**రచయిత కుర్నబెల్లి గణేష్, ఎంఏ బిఇడి,**
**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి - ఆదివాసి విద్యార్థి సంఘం**

# ఏవో ఆధ్వర్యంలో కుటుంబ నిర్ధారణ దరఖాస్తులు

**ఎర్రుపాలెం,నవభూమి, సెప్టెంబర్ 20:** మండల పరిధిలోని జమలాపురం రైతు వేదిక వద్ద కస్టర్ పరిధిలోని గ్రామాల రైతుల కుటుంబ నిర్ధారణ దరఖాస్తులను శుక్రవారం మండల వ్యవసాయశాఖ అధికారి ఎం రాధ ఆధ్వర్యంలో సిబ్బంది స్వీకరించి ఆన్లైన్ చేశారు. ఈ సందర్భంగా ఏవో రాధ మాట్లాడుతూ రెండు లక్షల రూపాయల లోపు బ్యాంకులలో అప్పు ఉండి రేషన్ కార్డు లేక రుణమాఫీ రాని రైతుల దరఖాస్తులను తీసుకొని ఆన్లైన్ చేసినట్లు తెలిపారు. శుక్రవారం జమలాపురం రైతు వేదిక పరిధిలోని జమలాపురం, వెంకటాపురం, నారాయణపురం, రాజుపాలెం, సత్యనారాయణపురం, గట్ల గౌరవరం, కాచవరంతో పాటుగా ఎరుపాలెం రైతు వేదిక కస్టర్ పరిధిలోని గ్రామాల, బనిగండ్లపాడు రైతు వేదిక కస్టర్ పరిధిలోని గ్రామాల రైతుల నుండి దరఖాస్తులు తీసుకున్నమని అన్నారు. రుణమాఫీ రాని రైతుల వద్ద నుండి కుటుంబ సభ్యుల ఆధార్ కార్డుల జిరాక్స్లు, పొలం పాస్ బుక్ జిరాక్స్,బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ లను తీసుకొని కుటుంబ సభ్యుల నిర్ధారణను ఆన్లైన్లో చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు బాలకృష్ణ, కుమారి, దుర్గ ప్రసన్న, గోపి ,రైతులు పాల్గొన్నారు.



## 21న బంద్‌ను జయప్రదం చేయండి: కొడెం వెంకటేశ్వర్లు

**గుండాల సెప్టెంబర్ 20 నవభూమి:** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జైనూరు మండల కేంద్రానికి చెందిన ఆదివాసి మహిళపైన ఎస్కే ముద్దాం అత్యాచారం చేసి హత్యా ప్రయత్నం చేసిన వ్యక్తి పైన కేసు నమోదు చేసి విచారణ చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా ఆరు నెలలలోపు అతనిని బహిరంగంగ ఉరిశిక్ష విధించాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ కోడెం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈనెల 21న బంద్ పాటించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ తీర్మానం చేయటం జరిగింది. ఆదివాసి మహిళలపైన అగాయిత్యాలకు పాల్పడుతున్న ఇలాంటి వ్యక్తులకి అత్యాచారానికి పాల్పడకుండా ఉండాలంటే వీరికి బహిరంగంగా ఉరిశిక్ష విధించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల వ్యాపారస్తులు అలాగే ఆర్టీసీ బస్సులు వివిధ ట్రాన్స్పోర్ట్ లారీలు ఆటోలు కార్మికులు కర్షకులు ప్రజలు ప్రజాస్వామ్యవాదులు అత్యాచారాన్ని గురైన మహిళకి సహాయ సహకార అందిస్తూ బందు పాటించాలని, అదేవిధంగా ఆదివాసి ఉద్యమానికి ఆదివాసీలు ఎస్సీలు బీసీలు ఓసీలు మైనార్టీలు అందరూ భాగస్వాములై బంద్ పాటించాలని తెలియజేశారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు: తల్లాడ ఎస్సై కొండలరావు



**తల్లాడ, నవభూమి, సెప్టెంబర్ 20:** తల్లాడ మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తల్లాడ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ కొండలరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని గొల్లగూడెం కట్టలేరు బాగు నుండి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం తన దృష్టికి వచ్చిందన్నారు. ట్రాక్టర్ల యజమాను లను పిలిపించి హెచ్చరించడం జరిగింది అన్నారు ఎవరైనా నిబంధనలకు అధిక్రమిస్తే ఊరుకోనున్నారు ఎవరికైనా ఇసుక కావాల్సి వస్తే సంబంధిత అధికారులను అనుమతి తీసుకోవాలని సూచించారు అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## బంగారం దొంగతనం కేసులో ఆరుగురు మహిళలకు జైలు శిక్ష

**కొత్తగూడెం సెప్టెంబర్ 20 నవభూమి ప్రతినిధి:** బంగారం దొంగతనం కేసులో ఆరుగురు మహిళలకు జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏ.సుచరిత శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా... జూలూరుపాడు మండలం వెంకన్నపాలెం కు చెందిన జాజిరియా సునీత వేంగనపాలెం క్రాస్ రోడ్డు వద్ద బంగారం షాప్ నడుచున్నది. 13 అక్టోబర్ 2017న బంగారం షాపులో బంగారం కొనేవాళ్ళ రద్దీ ఎక్కువగా ఉన్నది. గుర్తుతెలియని మహిళలు బంగారు నగలు చూసి కొనకుండా వెళ్ళిపోయారు. తనకు అనుమానం వచ్చి సిసి ఫ్టుజి చూడగా ఒకరు దొంగతనం చేసిన వస్తువును మరొకరికి ఇస్తూ అలా మొత్తం అందరు కలిసి వెళ్లిపోయారు. వెండి పట్టీల విలువ 7వేల రూపాయలు చేస్తుంది. వారిని వెతకగా దొరకనందున జూలూరుపాడు పోలీస్ వారికి ఫిర్యాదు చేయగా అప్పటి సబ్ ఇన్స్పెక్టర్ పి. శ్రీనివాస్ కేసు నమోదు చేసుకొని అప్పటి వరంగల్ జిల్లా నరసింహుల పేట మండలము పకీర తండా బొడ్డు తండాలకు చెందిన గుగులోతు కోబి.భూక్య మంక్తి భూక్య అంకు, భూక్యా సీత, ఆంగోతు రాజి,లాకావత్ కాళీ లు దొంగతనం చేసి చేసినారని వారి దగ్గర వెండి పట్టీలు రికవరీ చేసి ,దర్యాప్తు అనంతరం ఆరుగురు మహిళలపై కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశాడు. కోర్టులో ఏడుగురు సాక్షుల విచారించిన అనంతరము వారిపై నేరం రుజువుగా ఆరుగురు మహిళల కు ఒక్కొక్కరికి ఆరు నెలల జైలు, శిక్ష 500 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసెక్యూషన్ ను విశ్వశాంతి నాగలక్ష్మి లు నిర్వహించారు. నోడల్ ఆఫీసర్ సబ్ ఇన్స్పెక్టర్ వి. రామమూర్తి,లైజాన్ ఆఫీసర్ ఎస్కే అబ్దుల్ ఘని, (కోర్టు డ్యూటీ ఆఫీసర్) పీ. ఎస్. జూలూరుపాడు పిసి. పీ.ఉపేందర్ రావు లు సహకరించారు.

### టీడబ్ల్యు పిఏఏ, టిఏఎస్ ఎస్ చిత్రకారుల జేఏసీ ఆధ్వర్యంలో

# వరద బాధిత చిత్రకారులకు చేయూత

**తిరుమలాయపాలెం నవభూమి సెప్టెంబర్ 20–** ఖమ్మం నగరంలో మొన్న వచ్చినటువంటి వరదల కారణంగా అనేక కుటుంబాలు పూర్తిస్థాయిలో నష్టపోయారు . నష్టపోయిన కుటుంబాలలో ఖమ్మం పెయింటింగ్ చిత్రకారుల (ఆర్టిస్ట్) కుటుంబాలు అనేకంగా ఉన్నాయి . చిత్రకలనే నమ్ముకొని జీవనం సాగిస్తున్నటువంటి కళాకారుల బతుకుల్లో కన్నీరే మిగిలింది . ముంపు ద్వారా నష్టపోయిన చిత్రకారుల కుటుంబాలను ఆదుకోవడం కోసం రాష్ట్ర నలమూలల నుంచి చిత్రకారులు మేము సైతం నీకోసం అని కొంత విరాళాలను సేకరించి ప్రతి బాధిత కుటుంబానికి అర క్వింటా బియ్యం , నెలరోజులకు సరిపడా నిత్యావసర సరుకులు ఆ చిత్రకారుల కుటుంబాలకు అందజేసి చేయూతను అందించారు . ఈ సందర్భంగా చిత్రకళ జేఏసీ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ భాగస్వామ్యంలో కీలకపాత్రను పోషిస్తున్నటువంటి మా చిత్రకలను ప్రోత్సహించడంలో ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఇతర వృత్తి కళాకారులను గుర్తించినట్లుగా వారికి కేటాయించిన కార్పొరేషన్ నిధులను ఎలాగైతే చేస్తున్నారో కళనే నమ్ముకుని జీవిస్తున్నటువంటి లక్షలాది కుటుంబాలు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాయని కావున ఇకనైనా మా కళాకారులను గుర్తించి మాకంటూ ప్రత్యేకమైన కార్పొరేషన్ ఏర్పాటు చేసి మా సంక్షేమానికి తక్షణమే 1000 కోట్ల బడ్జెట్ను కళాకారులకు నిధులు విడుదల చేసి ఉపాధి కోల్పోతున్న చిత్రకళా కార్మికులకు తక్షణమే పని కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఇండ్లు లేని చిత్రకారులకు స్థలం కేటాయించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని , చిత్రకళా రంగంలో అనేక సేవలందించిన కళాకారులు వయసు మీద పడి పని చేయలేని పరిస్థితిలో ఉన్నారు 50 సంవత్సరాలు దాటిన కళాకారులకు పెన్షన్ రూపంలో ప్రభుత్వం ఆదుకోవాలని , చిత్ర కళాకారుల కుటుంబాల పిల్లలకు కార్పొరేషన్ స్థాయిలో ఉచిత విద్యను అందించాలని , విద్య హక్కు చట్టం ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాయింగ్ టీచర్లను భక్తి చేయాలని , ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో చిత్రకారులకు ఉన్న అవకాశాలను ప్రతిదీ గుర్తించి వారికి కల్పించి వారిని ఆదుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు . ప్రభుత్వాలు మమ్మల్ని గుర్తించని ఎడల మా జేఏసీ ఆధ్వర్యంలో ఉధృతమైన పోరాటాలు కొనసాగిస్తామని తెలియపరిచారు . ఇట్టి కార్యక్రమంలో చిత్రకళ జేఏసీ రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి రాజేశ్వర్ , గాజుల శ్రీరామ్ , మీసాల నాగేశ్వరరావు , గంజి వార్ రామకృష్ణ , దాసరి సీతారాములు , కొత్తూరి మోహన్ , మైదం మల్లేష్ , కొమ్ము ప్రకాష్ , మాడిశెట్టి బాలకృష్ణ , దాసరి బిక్షం , జంగిలి భరత్ , యాదన్ రావు , మానుమల్ల కిరణ్ , ఉపేంద్ర చారి , కుటుంబరావు , కళ్యాణం రవి , శరత్ , వీరభద్రం , షఫీ , సాయి , రాయి విష్ణు , ఖమ్మం చిత్ర కళాకారులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు












### రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో రాకాసి తండా

# వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

**తిరుమలాయపాలెం నవభూమి సెప్టెంబర్ 20–** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాకాసి తండా గ్రామం పూర్తిగా వరద ఉధృతిలో సర్వం కోల్పోయి నిరాశ్యులైన గ్రామస్తులకు రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా 3150 గవర్నర్ కే శరత్ చౌదరి సహకారంతో సహకారంతో రోటరీ క్లబ్ చైర్మన్ కందుల కొండలరావు ఆధ్వర్యంలో రాకాసి తండా వరద నిత్యవసర సరుకులు వెయ్యి రూపాయల విలువ గలిగిన వస్తువులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా తిరుమలాయపాలెం తహసిల్దార్ పీవీ రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఖమ్మం జిల్లాతో పాటు ఆంధ్రాలో అనేక కుటుంబాలు వరద తాకిడికి నిరాశ్రేణి వారందరికీ తెలంగాణలో 25 లక్షల రూపాయల వ్యయంతో మరియు ఆంధ్రప్రదేశ్ లో 20 లక్షల రూపాయలు వేయంతో నిత్యవసర సరుకులు పంపిణీ చేశామని శుక్రవారం తిరుమలాయపాలెం మండలంలో రాకాసి తండా గ్రామ ప్రజలు తీవ్రంగా నష్టపోయారని తెలుసుకొని 78 కుటుంబాలకు నిత్యం వాడే వస్తువులు పంపిణీ చేయడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. రాకాసి తండా ప్రజలు ధైర్యంగా ఉండాలని వారి ఆదుకోవడానికి వ్యాపారస్తులు ప్రభుత్వ ఉద్యోగులు స్వచ్ఛంద సంస్థలు ఎన్నారైలు ముందుకు రావాలని కోరారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పీవీ రామకృష్ణ ఆర్ఐ వీరయ్య ఖమ్మం రోడ్డు రోటరీ క్లబ్ చైర్మన్ కందుల కొండలరావు స్వచ్ఛంద సేవకులు ఏట్కూరి



ఉపేందర్ మాజీ అధ్యక్షులు రామకృష్ణ ఉపాధ్యక్షులు జే వెంకటరెడ్డి రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు డాక్టర్ కి సుధాకర్ ఇంజమ్ యాకూబ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆళ్లపల్లి మండల పరిధిలో సీసీ రోడ్లు ప్రారంభించిన పినపాక ఎమ్మెల్యే పాయం







**ఆళ్లపల్లి సెప్టెంబర్ 20 నవభూమి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండల పర్యటనలో భాగంగా శుక్రవారం నడిమిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలలో లొద్దిగూడెం గ్రామంలో రూ. 8.5లక్షల విలువ గల సీసీ రోడ్డును, పెదూరు గ్రామంలో రూ. 8.5లక్షల విలువగల సీసీ రోడ్డు, మార్కోడు గ్రామ పంచాయతీ కేంద్రంలో కనకదుర్గమ్మ గుడి ముందు రూ. 7.5 లక్షల విలువ గల రోడ్డు, ఎస్సీ కాలనీలో రూ. 7.5లక్షల విలువ గల రోడ్డు, అలాగే జిన్నెల గూడెం గ్రామం లో రూ. 6.5లక్షల విలువ గల సీసీ రోడ్డు, రాఘువాపురం గ్రామపంచాయతీ సీతానగరం గ్రామంలో రూ. 8.5లక్షల సిసి రోడ్డు లను ప్రారంభించిన పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ అన్ని శాఖల అధికారులు, ఆళ్లపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాయం రామ నరసయ్య, వాసం శ్రీకాంత్, పాయం సత్యనారాయణ, పడిగా సమ్మయ్య, తెల్లం జానీ, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పసుమర్తిని పరామర్శించిన ఎమ్మెల్యే

**కల్లూరు, నవభూమి, సెప్టెంబర్ 20:** స్థానిక నివాసి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్రావు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి, జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ శుక్రవారం పసుమర్తి నివాసానికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ, ప్రభాకర్ చౌదరి, కల్లూరు పట్టణ, మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.



# పేదోళ్ళ ఇళ్లకు విద్యుత్ తీగలతో పొంచి ఉన్న ప్రమాదం

■ పేదవాడికి కష్టం వస్తే కనికరించే పరిస్థితి విద్యుత్ శాఖ అధికారులకు లేదా?



**బూర్గంపాడు సెప్టెంబర్ 20 నవభూమి:** బూర్గంపాడు మండల పరిధిలో మేజర్ పంచాయతీ మొరంపల్లి బంజర సబ్ స్టేషన్ సమీపంలో విద్యుత్ వైర్లతో ఆందోళన చెందుతున్న అమాయకులు. మూడంతస్తుల బిల్డింగు నిర్మాణం చేసిన వ్యక్తి ఇంటి వైర్లు ఇబ్బందులు తొలగించారు. ఎలా సాధ్యం ఐయింది. గత 20 సంవత్సరాల నుండి ఇక్కడే నివాసం ఉంటూ ఇంటి పన్ను కడుతున్న మేము ఎన్ని సార్లు అధికారులకు వినతిపత్రం ఇచ్చిన మా సమస్య వారి ద్రుష్టికి తీసుకువెళ్లిన ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. డబ్బులు ఇస్తేనే పని జరుగుతుందా అని పేద ప్రజలు వారి బాధను వెల్లడిపరిచారు. మరి సామాన్యుడికి ఇబ్బందులు వస్తే విద్యుత్ శాఖ అధికారులు ఆ సమస్య పరిష్కారం చేయరా, ఇదెక్కడి న్యాయం? వీరెక్కడి అధికారులు? సామాన్యుడికి ఇబ్బందులు వస్తే పరిష్కరిస్తామని ప్రభుత్వ హామీ ఇస్తుంటే అందుకు భిన్నంగా బంజర విద్యుత్ శాఖ అధికారులు పనితీరుపై విమర్శల వర్షం. ప్రమాదం జరిగితేనే చర్యలు తీసుకుంటారా అంటూ ప్రశ్నిస్తున్న బాధితులు. కరెంట్ షాక్ తగిలి ఎవరైనా ప్రమాదం జరిగితేనే మా సమస్య పరిష్కారం చేస్తారా అంటూ





విద్యుత్ శాఖ అధికారులను నాయకులను నిలదీస్తున్న సామాన్యులు.

సాలి పురుగు ఏవిధంగా గూడు కట్టుకుంటుందో అలానే మా ఇళ్ళ చుట్టూ కరెంటు తీగలు ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. వానా కాలంలో చాలా సార్లు తెగిపడ్డాయి, ప్రాణాపాయ స్థితిలో నుండి తప్పించ బడ్డాము. ఇంటికి అనుకోని మెయిన్ వైర్లు ఉన్నాయి. ఎలక్షన్ ల ముందు ప్రతీ రాజకీయ నాయకుడు వచ్చి హామీలు ఇచ్చి వెళ్లిపోతున్నారు. సంవత్సరాలు గడుస్తున్న ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రతీ రోజు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని బ్రతులుతున్నాం. దయచేసి అధికారులు, నాయకులు ప్రాణ నష్టం జరగక ముందే సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు

# సీజనల్ వ్యాధుల పట్ల కళాజాత అవగాహన





**జూలూరుపాడు, సెప్టెంబర్ 20 (నవభూమి)** జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం సమాచార శాఖ అధికారి ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు శుక్ర వారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సీజనల్ వ్యాధులపై అవగాహన కొరకు కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహనలో భాగంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి చుట్టుప్రక్కల నీరు నిల్వ లేకుండా చూడాలని, తడి చెత్త పొడి చెత్త వేరుచేయాలని వివరించారు. అపరిశుభ్రత వలన దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, చికన్ గన్య, మలేరియా, టైఫాయిడ్ లాంటి విషజ్వరాలు రాకుండా పరిసరాల పారిశుధ్యం, వ్యక్తి గత పరిశుభ్రత పాటించి ఆరోగ్యం కాపాడుకోవాలని కళాకారులు తమ ఆట, పాట, మాటల ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మరియు సారథి కళాకారులు టీమ్ లీడర్ బాలు కాంపల్లి, కృపానందం, ముసా, నరేంద్ర, కుమారి నీలా, కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

# మోటార్ సైకిల్‌పై సంచరిస్తున్న గొలుసు దొంగలు

■ అప్రమత్తంగా ఉండాలంటున్న ఎస్ఐ షాకీర్

**కల్లూరు, నవభూమి, సెప్టెంబర్ 20:** పల్సర్ మోటార్ సైకిల్ పై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తూ, మహిళల మెడలో బంగారు గొలుసులను అపహరిస్తున్నారని, మండలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై షాకీర్ హెచ్చరించారు. మంగళవారం పరిసర పెనుబల్లి మండలంలో భార్యాభర్తలు మోటార్ సైకిల్ పై వెళు తుండగా శుక్రవారం వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు తమ పల్సర్ బైక్ తో ఢీ కొట్టి, వారి నుంచి గొలుసు లాక్కొని పరారయ్యారు. సమీప రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నుండి విస్సన్నపేట, తిరువూరు మీదుగా సంచరిస్తూ పెనుబల్లి మండలంలో దొంగతనానికి పాల్పడ్డారు. విస్సన్నపేట, తిరువూరు మండలాల్లో కూడా ఇదే రోజు మహిళల మెడలో గొలుసు దొంగతనాలు జరిగినట్లు సమాచారం. ఒంటరిగా ఉన్న మహిళలు, పురుషుల మెడలో ఉన్న బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడుతున్నందున ప్రభుత్వంగా ఉండాలని హెచ్చరించారు. అలాంటి వ్యక్తులు మండలంలో సంచరిస్తున్నట్లుగా గుర్తించిన యెడల వెంటనే డయల్ 100 నెంబర్ కు గాని, ఎస్సై కల్లూరు నెంబర్ కి గాని ఫోన్ చేసి సమాచారం అందించాలని ప్రజలను కోరారు. వరుస చోరీలకు పాల్పడుతున్న పాల్పడుతున్న ఈ అపరిచిత వ్యక్తులను పట్టుకునేందుకు ఇరు రాష్ట్రాలకు చెందిన బాధిత మండలాల పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నట్లు సమాచారం.



## బిజెపి బూతు స్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలి



**చర్ల సెప్టెంబర్ 20 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో బూత్ స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు కేవీ రంగా కిరణ్ అన్నారు. శుక్రవారం చర్ల మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమ మండల కన్వీనర్ నల్లూరి ఉదయ్ భాస్కర్ అధ్యక్షతన జరిగిన సభ్యత్వ నమోదు అవగాహన సదస్సులో ముఖ్య అతిధిగా రంగా కిరణ్ పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు కలిగిన అతిపెద్ద పార్టీ భారతీయ జనతా పార్టీ అని బూతు స్థాయిలో అత్యధిక సభ్యత్వాలు నమో దుచేసి మరోసారి మన రికార్డ్ మనమే అధిగమించాలని ఇది మనందరిపై భాద్యత ఉందని అన్నారు. అనంతరం సభ్యత్వం చేసే విధానంపై సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ పోనిశెట్టి వెనకటేశ్వర్లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ కుంజా ధర్మా రావు, అసెంబ్లీ కన్వీనర్ త్రినాధ రావు, ఓబీసీ జిల్లా అధ్యక్షులు బిట్రగుంట క్రాంతి కుమార్, జిల్లా కార్యదర్శి బిజ్జం శ్రీనివాస్ రెడ్డి, మండల కో కన్వీనర్లు ఎడవల్లి శేషగిరి రావు, నూపా రమేష్, గుమ్మల వేణు, అలెం సమ్మయ్య, చుక్క శివ, పినపాక మండల అధ్యక్షులు శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



**దమ్మపేట సెప్టెంబర్ 20 నవభూమి:** దమ్మపేట మండలం పార్కలగండి ఆశ్రమపాఠశాలలో మండల స్థాయిలో ఎస్ జి ఎఫ్ అన్ని పాఠశాలల విద్యార్థులకు జరుగుతున్న ఆటల పోటీలకు ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొని క్రీడాకారుల పరిచయ కార్యక్రమం అనంతరం పిల్లలతో కలిసి సరదాగా కబడ్డీ ఆడారు. అనంతరం క్రీడలను ఉద్దేశించి ప్రసంగించి ప్రథమ ద్వితీయ స్థానాలలో నిలిచిన జట్లకు బహుమతులు ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉపాధ్యాయులు పలు పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు రాష్ట్ర బందుకు పిలుపునిచ్చిన ఆదివాసీ నాయకపోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ

**మంచిర్యాల జిల్లా భీమారం ప్రతినిధి సెప్టెంబర్ 20 ( నవభూమి ):** ఆదివాసి నాయకపోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు గంజి రాజన్న ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసి నాయకపోడు హక్కుల పరిరక్షణ కమిటి తుడుం దెబ్బ దాని అనుబంధ సంఘాలు, ఆదివాసీ పటేళ్ల సంఘం, ఆదివాసి రాయి సెంటర్ వ్యవస్థ కార్మిక కర్షక విద్యార్థి మహిళ సంఘాల నాయకులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి కేస్లాపూర్ డిక్లరేషన్ను జైనూర్ సంఘటనపై ప్రకటించిన ఉద్యమ కార్యాచరణలను ఆదివాసి పెద్దల సభ తీసుకున్న నిర్ణయాన్ని ఆమోదిస్తూ స్వాగతిస్తూ జైనూరు సంఘటనపై తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సంపూర్ణ బంధు నిర్వహించే విధంగా, ప్రతి ఒక్క ఆదివాసి ఉద్యమ నాయకునికి పిలుపునిస్తున్నామని ఆదివాసీ నాయక పోడు హక్కుల పరిరక్షణ కమిటి జిల్లా కార్య దర్శి తైనేని మహేష్ పిలుపునిచ్చారు.

# మొహమ్మద్ ప్రవక్త విశ్వ మానవాళి మార్గదర్శి

■ సిపిఐ జిల్లా కార్యదర్శి సాబిర్ పాషా






**కొత్తగూడెం సెప్టెంబర్ 20 నవభూమి ప్రతినిధి:** మిలాద్ ఉన్ నబి సందర్భంగా అంజుమన్ వెల్ఫేర్ సొసైటీ మరియు రైల్వే మసీదు వారి ఆధ్వర్యంలో శుక్రవారం నమాజు అనంతరం ముస్లింలు ఊరేగింపు నిర్వహించారు.కొత్తగూడెం డిపో మసీద్ నుండి రైల్వే స్టేషన్ వరకు, అక్కడి నుండి రైల్వే మస్జిద్ వరకు, పెద్ద ఎత్తున ముస్లింలు ప్రవక్త జన్మ దినం సందర్భంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, రాష్ట్ర ముస్లిం మైనార్టీ కాంగ్రెస్ నాయకులు ఉర్దూ ఘర్ చైర్మన్ నయీమ్ ఖురేషి,టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ వద్ద జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబిర్ పాషా మాట్లాడుతూ మొహమ్మద్ ప్రవక్త విశ్వ మానవాళికి, సన్మార్గం లో జీవించడానికి కావలసినటువంటి ఆచరణా త్మకమైన జీవనవిధానాన్ని ప్రపంచానికి అందించారాన్నారు. శత్రువును కూడా ప్రేమించే విశాల హృదయం ఉన్నవారు. ఇది ప్రతి మనిషి జీవితం లో అలవర్చుకోవాలి, అలాగే ఆయన దాతృత్వం, శ్రమ జీవిని గౌరవించడం కూడా ఆచరణ యోగ్యం అన్నారు. దేశం లో అన్నికులాలు మతాలు విభేదాం లేకుండా కలసి సమైక్యత తో జీవించాలన్నారు. నయీమ్ ఖురేషి మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం మన దేశం ప్రత్యేకత అన్నారు. అందరం సమైక్యంగా ఈ బేధ భావం లేకుండా ఉండాలన్నారు. మహమ్మద్ ప్రవక్త ఆచరించిన విధానాన్ని మనం 10 శాతం ఆచరిస్తే దేశం బాగుపడుతుందని ఆయన బాటలో మనం నడవాలని అన్నారు. రామవరంలో ముస్లిం మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్లో సిఎస్ఆర్ నిధులతో మంజూరు చేయించిన ఎమ్మెల్యే కూనంనేని కృషి చేసిన సాబీర్ పాషా కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ర్యాలీలో మహముద్దీన్ ఖాన్, అమీర్, అన్వర్, మాజీ కౌన్సిలర్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

## అప్ గ్రేడ్ అయినా మినీ అంగన్వాడీలకు

# పెరిగిన జీతం ఇవ్వాలని కలెక్టరేట్ ముట్టడి





**కొత్తగూడెం సెప్టెంబర్ 20 నవభూమి ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్వాడీ టీచర్స్ కు గత నాలుగు నెలలుగా పూర్తీ వేతనం ఇవ్వకుండా కట్ చేసి సగం వేతనం ఇస్తున్నందున ఏఐటీయూసీ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్వాడీలు జిల్లా కలెక్టరేట్ ఎదుట రెండు గంటల పాటు బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చెరుకూరి సీతమహాలక్ష్మి మాట్లాడుతూ తెలంగాణ ఐ సి డి ఎస్ లో పనిచేస్తున్న మినీ అంగన్వాడీ టీచర్ ను రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక. శిశు సంక్షేమ శాఖ మంత్రి గా సీతక్క తొలి సంతకం రాష్టంలో గల మినీ అంగన్వాడీ కేంద్రంలను సుమారు నాలుగు వేల సెంటర్స్ ను మెయిన్ సెంటర్ గా అప్ గ్రేడ్ చేసి సెంటర్ లో పనిచేస్తున్న మినీ టీచర్ వేతనం రూ.7,750 నుండి రూ 13,650 రూపాయలు కు జిఓ ఎంఎస్. 47, 10/08/2021 స్పషల్ సెక్రటరీ పెంచుతూ ఉత్తర్వులిచ్చారన్నారు. పెంచిన వేతనం 3 నెలలు ఇచ్చారు. గత నాలుగు నెలలు నుండి సగ భాగం అనగా వేతనం రూ.7,750 అకౌంట్ లో వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పెంచిన వేతనం రూ.13,650 ఇవ్వాలని కోరారు. ఈ ధర్నా లో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ మినీ అంగన్వాడీ లకు ఎన్నికలు డ్యూటీ లు రద్దు చెయ్యాలని, పెండింగ్ లో ఉన్న ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్స్, ఆరోగ్యలక్ష్మి బిల్స్, ఈవెంట్ బిల్స్ ఇవ్వాలని, మినీ అంగన్వాడీ సెంటర్ లో ఆయా పోస్ట్ లు భర్తీ చెయ్యాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కు జిల్లా సంక్షేమ అధికారి విజేత కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, వేల్పుల మల్లికార్జన్, మోహన్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు గోనే మణి, వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్యా లలిత, పాయం శ్రీలత, రమాదేవి, పద్మ, సరోజినీ. శ్రీదేవి, అరుణ, సునీత. వెంకటమ్మ, లలిత, సరస్వతి, రాజేశ్వరి, స్వర్ణ, రమణ, పాల్గొన్నారు.



# పిడుగు పడి యువకుడి మృతి, తల్లికి తీవ్ర గాయాలు



**గార్ల, నవభూమి, సెప్టెంబర్ 20:** పిడుగు పడి యువకుడు మృతి చెందిన విషాద సంఘటన మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పాత పోచారం గ్రామం లో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అల్లం కోటేశ్వరి పంట పొలంలో పనిచేస్తుండగా తీవ్రమైన గాలి దుమారం, ఉరుములు, మెరుపులు వస్తుండటంతో తల్లి కోటేశ్వరిని తీసుకొచ్చేందు కు అల్లం ప్రవీణ్ (21) వెళ్ళాడు. అదే సమయంలో పిడుగు పడటంతో ప్రవీణ్, కోటేశ్వరి తీవ్ర గాయాలపాలై స్పృహ కోల్పోయారు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం హుటాహుటిన ఖమ్మం తరలిస్తుండగా మార్గ మధ్యంలో ప్రవీణ్ మృతి చెందాడు. ఈ సంఘటన పాత పోచారంలో విషాద ఛాయలు అలుముకున్నాయి

# ఉద్యమనేత ప్రజల మనిషి కాంపాటి చంద్రన్న: మాస్ లైన్ నాయకులు ధర్మపురి వీరబ్రహ్మాచారి



**టేకులపల్లి సెప్టెంబర్ 20 నవభూమి ప్రతినిధి :** కాంపాటి చంద్రన్న టేకులపల్లి మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిత్యం గ్రామాలలో ఉంటూ, ప్రజల సమస్యల పరిష్కారం చేసేవాడని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్. టేకులపల్లి మండల కమిటీ జోహార్లు అర్పించింది. ఆటపాటలతో మిమిక్రీ చేసి ప్రజలను నవ్వించేవాడని, ఎంతటి సమస్య అయినా చాలా సులువుగా పరిష్కారం చేసేవాడని, టేకులపల్లి మండలంలోని 102 గ్రామాలలో చంద్రన్న అంటే తెలియని మనిషి లేరు. మండలంలో చంద్రన్న 1995 డిసెంబర్లో ఆర్గనైజర్గా వచ్చిన తరువాత కొత్త ప్రాంతాలలో పార్టీ జెండాలు ఎగురవేశారు. బొమ్మనపల్లి, సులానగర్, తడకలపూడి పంచాయతీలలో పార్టీ కమిటీలను చంద్రన్న ద్వారా ఏర్పాటు చేయడం జరిగింది. చంద్రన్న నాయకత్వంలో శంభునిగూడెం పంచాయతీలో ప్రజలను ఐక్యం చేసి, భూమిలేని నిరుపేదలను కూడగట్టి పోడు భూములను కొట్టించారు. అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నారు. చంద్రన్న మరణం టేకులపల్లి మండల ఉద్యమానికి తీరనిలోటు. జోహార్ కామ్రేడ్ చంద్రన్న. జోహార్లు అర్పించినవారిలో మండల కార్యదర్శి ధర్మపురి వీరబ్రహ్మాచారి, నాయకులు జరుపుల సుందర్, బి.పంతులు, బి.లింగ, ఏనుటి నాగయ్య, సుడిగాలి వెంకన్న, గుగులోతు మదార్ ఉన్నారు.

# ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి దరఖాస్తులకు ఆహ్వానం

**టేకులపల్లి సెప్టెంబరు 20 నవభూమి ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లాలోని అన్ని మండల పరిషత్ కార్యాలయాలకు ఉత్తర్వులు చేరాయి. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి 18 సంవత్సరాలు వయసు పైబడిన వారు అర్హులని పేర్కొన్నారు దరఖాస్తుదారులు, తమ దరఖాస్తులను ఆయా పంచాయితీల కార్యదర్శులకు అందజేయాలని తెలిపారు. తమ దరఖాస్తులతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్ కార్డుకు లింకు చేయబడిన మొబైల్ నెంబర్ జత చేయాల్సిందిగా పేర్కొన్నారు. తమ దరఖాస్తులను, ఈ నెల అనగా సెప్టెంబరు 20వ తేదీ నుంచి వచ్చే నెల అక్టోబర్ 1 తేదీ వరకు గ్రామపంచాయతీ కార్యదర్శులకు అందజేయాల్సి ఉంటుంది. ఈ పథకానికి 18 రకాల వృత్తిదారులు అర్హులుగా కలెక్టర్ పేర్కొన్నారు. అవి వడ్రంగి, పడవల తయారీదారులు, ఆయుధ తయారీదారులు, కమ్మరి, సుత్తులు టూల్ కిట్ తయారీదారులు, తాళాల తయారీదారులు, శిల్పకారులు, స్వర్ణకారులు, కుమ్మరులు, చెప్పులు కుట్టేవారు, మేస్త్రీలు, బట్టలు, బుట్టలు, చాపలు, చీపుర్లు తయారు చేసేవారు, బొమ్మలు తయారు చేసేవారు, నాయి బ్రాహ్మణులు, పూలమాలలు తయారు చేసేవారు, రజకులు, టైలర్లు, చేపలుపట్టు వలలు తయారుచేసేవారుగా పేర్కొన్నారు.

# మధ్యాహ్నం భోజన కార్మికుల ధర్నా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో

**సత్తుపల్లి,నవభూమి, సెప్టెంబర్ 20:** నియోజకవర్గ కేంద్రంలో మండల విద్యాశాఖ కార్యాలయం దగ్గర మధ్యాహ్నం భోజన కార్మికులు సమస్యల పరిష్కరించాలని శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర మధ్యాహ్నం భోజనం పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, ఏఐటియుసి రాష్ట్ర కమిటీ సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ మాట్లాడుతూ గత పది నెలలుగా రావాల్సిన కోడిగుడ్ల బిల్లులు, అల్పాహారం బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రెండు రూపాయల వేతనం పెండింగ్లో ఉన్నాయన్నారు. దసరా సెలవు లోపు పెండింగ్ మెస్ చార్జీలు, పెండింగ్ వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే మధ్యాహ్న భోజన కార్మికులకు ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గౌరవ వేతనం పదివేలకు పెంచుతామని మేనిఫెస్టోలో హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ దసరా కానుక గా అమలు చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ఆదేశాల మేరకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులకు రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. వంటకు కావాల్సిన వంట పాత్రలు, వంట సరుకులు, గ్యాస్, కూరగాయలు, కోడిగుడ్లను ప్రభుత్వమే సఫరా చేయాలన్నారు. లేనియెడల ప్రతి విద్యార్థికి పెరిగిన ధరలకు అనుగుణంగా రోజుకు ముప్పై రూపాయలకు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి సిపిఐ మండల కార్యదర్శి




తడకమల్ల యోబు, ఎఐటియుసి మండల అధ్యక్ష, కార్యదర్శులు తెల్లగారపు రామారావు, కర్నాటి బసవయ్య, మధ్యాహ్నం భోజనం వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కుంటాఎంకమ్మ, మహాదేవ లక్ష్మి, పొదిలి జయమ్మ, శ్రీలక్ష్మి, శివకుమారి, సక్కుబాయి, సావిత్రి, కృష్ణవేణి, కమల, అనసూయ, వెంకమ్మ, విజయలక్ష్మి, కే లక్ష్మి, జుబేదా,తదితరులు పాల్గొన్నారు

# ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు



**ఎర్రుపాలెం,నవభూమి, సెప్టెంబర్ 20:** గత రెండు రోజులుగా ఎర్రుపాలెం ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి. క్రీడలలో ఉత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించిన క్రీడాకారులకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, ఐలూరు వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు బహుమతులు అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలలో నిరంతరం సాధన చేస్తూ ఉంటే మంచి నైపుణ్యం కలుగుతుందన్నారు. క్రీడలలో రాణించడం వలన భవిష్యత్తులో ప్రభుత్వ,ప్రైవేటు ఉద్యోగాల్లో అవకాశం ఉంటుందన్నారు. సీనియర్స్ కబడ్డీ బాలుర విభాగంలోమొదటి బహుమతి భీమవరం పాఠశాల విద్యార్థులు, రెండవ బహుమతి రామన్నపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు సాధించారు.జూనియర్ బాలుర విభాగంలో సెంట్ విన్సెంట్ మొదటి స్థానం, ఎస్వీ అకాడమీ రెండో స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో మొదటి బహుమతి గురుకుల పాఠశాల,రెండో బహుమతి భీమవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు సాధించారు. కో కో బాలుర విభాగంలో మొదటి బహుమతి భీమవరం,రెండో బహుమతి ఎర్రుపాలెం పాఠశాల విద్యార్థులు సాధించారు.బాలికల విభాగంలో గురుకుల పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం,మీనవోలు విద్యార్థులు రెండో స్థానం సాధించారు.జూనియర్ కోకో బాలుర విభాగంలో మొదటి బహుమతి



మీనఓలు,రెండవ బహుమతి భీమవరం విద్యార్థులు సాధించారు. బాలికల విభాగంలో మొదటి బహుమతి భీమవరం,రెండో బహుమతి మామనూరు విద్యార్థులు సాధించారు. వాలీబాల్ సీనియర్ బాలుర విభాగంలో మొదటి బహుమతి ఎర్రుపాలెం హై స్కూల్, రెండో బహుమతి మాముునూరు పాఠశాల విద్యార్థులు,బాలికల విభాగంలో మామునూరు మొదటి బహుమతి,సెంట్ విన్సెంట్ రెండవ బహుమతి సాధించాయి. జూనియర్స్ విభాగంలో మామునూరు మొదటి బహుమతి,ఎర్రుపాలెం ఉన్నత పాఠశాల రెండో బహుమతి సాధించాయి. బాలికల విభాగంలో ఎర్రుపాలెం మొదటి బహుమతి,మీనవోలు పాఠశాల రెండో బహుమతి సాధించాయి.ఈ కార్యక్రమంలోమండల క్రీడల కన్వీనర్ రాజు, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,దండెం సత్యనారాయణరెడ్డి,టి వెంకటేశ్వర్లు,బి సూర్యనారాయణ,బి వెంకటేశ్వరరావు, విద్యార్థులు,నాయకులు పంబి సాంబశివరావు, రాజీవ్ గాంధీ,అనుములు కృష్ణారావు,లక్ష్మణరావు, కడియం శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

# గురుకుల డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం

## ■ 'కెరియర్ గైడెన్స్ సెల్ వర్క్ షాప్'



**ఖమ్మం రూరల్, నవభూమి, సెప్టెంబర్ 20:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం కామర్స్ విభాగం 'కళాశాల కెరియర్ గైడెన్స్ సెల్ ఒకరోజు వర్క్ షాప్' నిర్వహించారు. హైదరాబాదుకు చెందిన 'మీఠం ఐటీ టెక్నాలజీ' మేనేజింగ్ డైరెక్టర్ విశాల్ చేత 'పవర్ బీఐ' అనే అంశం మీద ఈ వర్క్ షాప్ నిర్వహించారు. విద్యార్థినులకు అభివృద్ధికరమైన మంచి వర్క్ షాప్ నిర్వహించినందుకు కళాశాల ప్రిన్సిపల్



డాక్టర్ శ్రీనివాసశర్మ కామర్స్ విభాగం అధ్యాపకులను, హెచ్ఓడి సిజిసి కో-ఆర్డినేటర్ డాక్టర్ అమీనా కాతూన్, రత్నమాల, శశికళ, సునీత, సుమలత, స్వప్నను అభినందించారు. విద్యార్థినులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగ పరుచుకోవాలని, ఫ్యూచర్ డెవలప్మెంట్ కి వినియోగించుకోవాలన్నారు. వర్క్ షాప్ అనంతరం ఈ కోర్సుకు సంబంధించిన సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ చేతులమీదుగా విద్యార్థినులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, కామర్స్ విభాగం అధ్యాపకులు, ఇతర అధ్యాపకుల బృందం, కామర్స్ విద్యార్థినులు పాల్గొన్నారు.

# నీటి అవసరాలు తీర్చాలి

## బిజెపి నేత వీరభద్ర ప్రసాద్ డిమాండ్



**ఖమ్మం, నవభూమి సెప్టెంబర్ 20:** ఖమ్మం ప్రజలకు అవసరమైన నీటిని సరఫరా చేయాలని భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షులు మార్తి వీరభద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక 26వ డివిజన్లో గత 15 రోజులుగా మునిసిపల్ వాటర్ రాకపోవడంతో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఇళ్లల్లో బోర్లు లేకపోవడం వల్ల, ఉన్న బోర్లు ప్రభుత్వం తొలగించడంతో ప్రజలు మున్సిపల్ నీటిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. నగరంలో నీటి సరఫరా లో ఏ కొద్దిపాటి అంతరాయం ఏర్పడిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల నీటి ఇద్దరికీ నానా అవస్థలు గురవుతున్నారు, పేదలకి నిత్యవసరంగా ఉపయోగపడే నీటి బోర్లను తొలగించి, నీటి కోసం అనేక ఇబ్బందులకు గురవుతున్న, పట్టించుకున్న నాధుడే కరువైనాడని, తక్షణమే శిథిలమైన బోర్లను మరమ్మత్తులు నిర్వహించి ప్రజల నీటి అవసరాలు తీర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మునిసిపల్ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించారు. సుమారు యాభై కుటుంబాలకి, తాగునీరుకు ఉపయోగపడే బోరు తొలగించి, మహిళలు అనేక ఇబ్బందులు గురిచేస్తున్నారని, వారి నీటి ఎద్దడిని వెంటనే తొలగించాలని, మున్సిపాలిటీ కార్పొరేషన్ స్థాయికి ఎదిగినప్పటికీ మంచి రేటు కోసం ప్రజలు ఇబ్బంది పడటం ప్రభుత్వ అసమర్ధకు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఉపాధ్యక్షురాలు మందా సరస్వతి, సూరి విష్ణు గుర్రాల నాగేందర్, ఆకుల మురళి, దళిత మోర్చా నాయకుల చింతమల్ల వీరస్వామి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న పీఎస్ఆర్ ట్రస్ట్ వరద సాయం

**ఖమ్మం రూరల్, నవభూమి, సెప్టెంబర్ 20:** ప్రభుత్వ సాయానికి తోడు తమ వంతు సాయం కూడా అందించాలని సదుద్దేశ్యంతో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కి చెందిన పీఎస్ఆర్ చారిటిబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన వరద సాయం శుక్రవారమూ కొనసాగింది. ఖమ్మం రూరల్ మండలం శ్రీరాం నగర్, ఏదులాపురం గ్రామాల్లో ఒక్కో కుటుంబానికి రూ.5000ల చొప్పున ఆర్థికసాయంతో పాటు నిత్యావసరాలను సుమారు 45 కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథబాబు, పాలేరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు భూక్య సురేష్ నాయక్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, కాంగ్రెస్ నాయకులు వెంపటి రవి, చారి, రాజు, భుజంగరావు, రమేష్, శేషు రెడ్డి, సీపీఐ నాయకులు వెంపటి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.





## సర్వమానవ సమానత్వాన్ని ఆచరణాత్మకంగా నెలకొల్పిన

# గొప్ప సంస్కర్త మొహమ్మద్ ప్రవక్త

- షాధిఖాన చైర్మన్, మజీద్ కమిటీ అధ్యక్షులు ఫయాజ్
- పాల్వంచలో ఘనంగా జులూస్ ఏ మహమ్మదీ శాంతి ర్యాలీ

**పాల్వంచ సెప్టెంబర్ 20 నవభూమి ప్రతినిధి:** సర్వమానవ సమానత్వాన్ని ఆచారాణాత్మకంగా నెలకొల్పిన గొప్ప సంస్కార్త మొహమ్మద్ ప్రవక్త అని స్థానిక షాదిఖనా, ఉర్దు ఘర్ చైర్మన్, జామే మజీద్ కమిటీ అధ్యక్షులు ఎండి ఫయాజ్ ఉల్ హాసన్ అన్నారు. మొహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించు కొని మీలాదున్నబి సందర్బంగా శుక్రవారం పట్టణంలో భారీ శాంతి ర్యాలి ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. స్థానిక జామే మసీద్ నుండి ప్రారంభమైన శాంతి ర్యాలి అబ్దుల్ కలాం టవర్, శాస్తి రోడ్, అప్సరా సెంటర్, రాజీవ్ గాంధీ రోడ్, కూరగాయల మార్కెట్, బస్టాండ్, బిసీఎం రోడ్, అంబేద్కర్ సెంటర్, కె ఎస్ పి రోడ్, నటరాజ్ సెంటర్ ల మీదుగా ప్రదర్శన తిరిగి జామే మసీదుకు చేరుకుంది. శుక్రవారం కావటం తో పట్టణ పరిధి లోని పలు మజీదు లకు చెందిన ముస్లిం సోదరులు భారీ సంఖ్యలో హాజరై, శాంతి ర్యాలీ లో పాల్గొన్నారు. జామే మసీదు ఇమామ్ మొహమ్మద్ సర్ఫారాజ్ ఆలం ఖాద్రి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం ఆయన మీలాదున్నాభి ప్రాముఖ్యతను ముస్లిం లకు వివరించారు. ఈ సందర్బంగా షాదిఖనా, ఉర్దుఘర్ చైర్మన్, జామే మజీద్ కమిటీ అధ్యక్షులు ఎండి ఫయాజ్ ఉల్ హాసన్ మాట్లాడుతూ ఈ నెల 16 నే మొహమ్మద్ మహా ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని జులుసే మొహమ్మదీ శాంతి ర్యాలీ, నిర్వహించాల్సి ఉండగా, అదే రోజు వినాయక నిమజ్జనం ఉండటం వల్ల మత సామారస్యానికి ఎలాంటి విఘాతం ఏర్పడకూడదన్న ఉద్దేశ్యంతో తమ ర్యాలీని వాయిదా వేసి ఈ శుక్రవారం నిర్వహించినట్లు తెలిపారు. క్రీ.శ. 570 లో మక్కలో జన్మించిన మహమ్మద్ కాల గతిని మార్చి వేసిన శూరుడని అన్నారు. ప్రపంచ విప్లవాల్లో ఆత్భుతమైన విప్లవాన్ని లేవదీసిన మేటి యోధుడని, మూఢ జనాన్ని మహోగ్యనులుగా చేసిన అద్వితీయ సంస్కర్త మొహమ్మద్ ప్రవక్తని అన్నారు. దైవానుసారంగా జీవించటంలోనే మానవ శ్రేయం, సౌభాగ్యాలు ఉన్నయని అన్నారు. మొహమ్మద్ ప్రవక్త తన జీవితంలో చాలా భాగం విచక్షణారహిత మైన హింసను అరి కట్టడానికే శ్రమించారని అన్నారు. అసలు ఇస్లాం అనే పదమే, ముస్లింలు తమ సరస్వాన్ని భగవంతుడికి అర్పించాలనే అర్ధాన్ని కలిగి ఉందని అన్నారు. సమాజంలో అదమ స్థాయి వ్యక్తులు గా పరిగనించ బడుతున్న వారికి ఉన్నత స్థానం కల్పించిన మహా వ్యక్తి మొహమ్మద్ అన్నారు. అనంతరం మజీద్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం ఖురేషి మాట్లాడుతూ ఇస్లాం మతం యొక్క సారాంశమే సర్వ మానవాళి యొక్క ఐకమత్యం ఇట్టి అంశాన్ని ఆచరణలో ప్రపంచ మానవాళికి చూపిన మహనీయుడు మహమ్మద్ ప్రవక్త అని, ప్రతి ముస్లిం మొహమ్మద్ ప్రవక్త చూపిన శాంతి మార్గంలో పయనించాలని అన్నారు. ఎన్ని అవాంతరాలు వచ్చినా పరమత సహనం పాటించి, అన్య మతాలను గౌరవించాలని, భిన్నత్వంలో ఏకత్వంలా కలిసి మెలిసి ఉండాలని, అందులోనే మానవత్వం ఉందని అన్నారు. ర్యాలీ సందర్బంగా ఎలాంటి అవాంచ నీయ సంఘటనలు జరుగకుండా పట్టణ ఎస్ఐ సుమన్ తమ సిబ్బంది తో గట్టి బందోబస్తూ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ ఫయాయాజుల్ హాసన్, మొహమ్మద్ ఇబ్రహీం ఖురేషీ, షేక్ మీరా సాహెబ్, ఖాజా అహ్మదుల్లాహ్ హుస్సేని, అక్బర్ అలీ, మొహమ్మద్ సర్ఫరాజ్ ఆలం, మొహమ్మద్ రఫిఉద్దీన్, సయ్యద్ ఖుస్రు అహ్మద్, ఫఖ్రుద్దీన్, ఫారూఖ్ ఖురేషీ, సయ్యద్ రహీం, మస్తాన్ ఖురేషీ, హసీమా ఫాన్సీ కబీర్, మదార్ సాహెబ్, జైనుల్లా బుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.









# ఎర్రుపాలెం పోలీసుల ఆధ్వర్యంలో వాహన తనిఖీలు

**ఎర్రుపాలెం,నవభూమి, సెప్టెంబర్ 20 :** స్థానిక ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్ సిబ్బంది ఎస్సై వెంకటేష్ ఆదేశాలతో శుక్రవారం ఎర్రుపాలెం రింగు సెంటర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ద్విచక్ర వాహనదారుల వద్ద వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు,లైసెన్సులను, వాహన నెంబర్ లను పరిశీలించారు. వాహనదారులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరు వాహనం నడిపేటప్పుడు తమ వద్ద వాహనానికి సంబంధించిన ద్రవపత్రాలు,లైసెన్సు, వాహనానికి నెంబర్ ప్లేట్, వాహనానికి ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఇటీవల కాలంలో కొంతమంది వ్యక్తులు ఎర్రుపాలెం మండలం చుట్టుపక్కల ప్రాంతాలలో చైన్ స్నాచింగ్ కు పాల్పడుతున్నారని అటువంటివారిని పట్టుకునే ప్రయత్నంలో ఎర్రుపాలెం పోలీసులు కూడా వాహన తనిఖీలను నిర్వహిస్తు న్నారని తెలిపారు. వాహనదారులు,ప్రజలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని



హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉపేందర్,ప్రకాష్ పాల్గొన్నారు.